సామాజిక శాస్త్రాల వైపు సైన్స్ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా వివిధ కోర్సుల్లో చదివేందుకు విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నారు. బీఎస్సీ విద్యార్థులు ఎంఏ కోర్సులు, బీఏ వాళ్లకు ఎంకాం, ఇంజినీరింగ్, మెడికోలకు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. గతంలో పీజీ కోర్సులు చదవాలంటే డిగ్రీలో తప్పని సరిగా సంబంధిత సబ్జెక్టును చదవాల్సి ఉండేది. రెండేళ్ల క్రితం ఈ నిబంధనను సడలించారు. డిగ్రీతో సంబంధం లేకుండా ఎంఏ, ఎంకాం కోర్సు ల్లో ప్రవేశాలకు అందరికి అవకాశం కల్పించారు. దీంతో సైన్స్ విద్యార్థులు సామాజిక శాస్త్రాలను చదివేందుకు ఆసక్తిని చూపుతున్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు వివిధ ఎంఏ, ఎంకాం కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని టీఎస్ సీపీజీఈటీ-2024 కన్వీనర్ ప్రొ. పాండురంగా రెడ్డి తెలిపారు. టీఎస్ సీపీజీఈటీ-2024లో వివిధ సామాజిక శాస్త్రాలకు దరఖాస్తు చేసుకున్న బీఎస్సీ అభ్యర్థుల సంఖ్య ఈ విధంగా ఉంది. ఎంఏ పొలిటికల్ సైన్స్‌కు 375 దరఖాస్తులు రాగా సోషియలజీ-333, చరిత్ర-285, సైకాలజీ-172, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-95, ఎకనామిక్స్-66,ఎంకాం-34 కాగా బీఏ పూర్తి చేసిన 40 మంది విద్యార్థులు ఎంకాం కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేయని అభ్యర్థులు రూ.500 ఫైన్‌తో ఈ నెల 25 వరకు రూ.2వేల ఫైన్‌తో 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

23 నుంచి వార్షికోత్సవాలు

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరిదేవి అమ్మవారి అష్టాదశ వార్షికోత్సవాలను ఈ నెల 23వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రతి రోజు కోటి కుంకుమార్చన కార్యక్రమం ఉంటుందని పెద్ద ఎత్తున మహిళ భక్తులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, గున్నాల ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ సభ్యులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలను బుధవారం లెక్కించగా రూ.92,29,521 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కుంట నాగరాజు తెలిపారు. 58 అమెరికా డాలర్స్, 21 యూఏఈ దినార్స్, 20 సౌదీ రియాల్స్ ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీదేవి, చైర్మన్ సాయిబాబాగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009లో కేంద్రం రూపొందించిన విద్యా హక్కుల చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని వివరించారు. కానీ విద్యా వ్యవస్థలోకి రాజకీయ నాయకులు ప్రవేశించడంతో విద్యా రంగం భ్రష్టు పట్టిందన్నారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు పరుస్తూ ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్, నరసింహనాయక్, మహేష్ పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్.. వ్యర్థాల డంపింగ్



హనుమాన్ దేవస్థానం ముందు రహదారులపై నిలిపిన కార్లు



ఉదయ్‌నగర్ వైపు వెళ్లే రహదారిలో పేరుకుపోయిన వ్యర్థాలు

సనత్‌నగర్: రోడ్లపై అడుగడుగునా అక్రమ పార్కింగ్‌తో జనం అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి వాహనాలు రోడ్ల వెంబడి నిలుపుతుండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సనత్‌నగర్‌లోని దాదాపు అన్ని రహదారులు అక్రమ పార్కింగ్‌తో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం రహదారి (హిందూ పబ్లిక్ స్కూల్ నుంచి-జెక్‌కాలనీ రోడ్డు వైపు), అలాగే దేవస్థానం, హిందూ పబ్లిక్ స్కూల్‌కు మధ్య రహదారులు కార్ల పార్కింగ్‌కు నెలవుగా మారాయి. ఫలితంగా ఆ మార్గాల్లో వెళ్లే వారికి అవస్థలు తప్పడం లేదు. కొంతమంది తమ పార్కింగ్ స్థలం అన్నట్లుగా దర్జాగా కార్లకు కవర్లు కూడా కప్పేసి నెలల తరబడి పార్కింగ్ చేసుకుంటూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. అక్రమ పార్కింగ్ మాటున కొంతమంది మద్యం తాగేందుకు అడ్డాగా మారాయి. దీనికి తోడు హిందూ పబ్లిక్ స్కూల్ నుంచి సెయింట్ థెరిస్సా స్కూల్ వైపు వెళ్లే రహదారిలో చెత్త పేరుకుపోయి దుర్గంధంగా మారింది. ఒకవైపు జీవీపీలను ఎత్తివేయాలని అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతూనే ఉన్నాయి. రహదారి పక్కనే ఇష్టానుసారంగా చెత్త డంప్ చేస్తుండడంతో ఆ మార్గంలో వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌లను నివారించడంతో పాటు చెత్త డంపింగ్‌కు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

జనరల్ బాడీ సమావేశంలో ఆదర్శ వివాహాలపై తీర్మానం



లాలాపేట: మ్యారేజ్ బ్యూరో వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. వచ్చే ఫిబ్రవరిలో ఆదర్శ వివాహాలు చేసేందుకు తీర్మానం చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు జై నందన్న తెలిపారు. గతంలో 8 జంటలకు ఆదర్శ వివాహాలు జరిపించినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరిలో ఆదర్శ వివాహాలను జరిపించనున్నామని ఎవరైనా ఉంటే 9392348185, 7981705919 నంబర్లలో సంప్రదించాలన్నారు. అసోసియేషన్ సభ్యులు బాల్‌రాజ్‌గౌడ్, రామలింగం, రాజమల్లు, కుక్కల శ్రీను,రేణుకమ్మ, సుగుణమ్మ,సీమ, భారతమ్మ, మంజుల, హేమ, శకుంతల పాల్గొన్నారు.

నేడు ఏఐసీఎఫ్ 28వ వార్షికోత్సవం

రాంగోపాల్‌పేట్: ఈ నెల 20వ తేదీన గోల్కొండ క్రాస్ రోడ్‌లోని మెనొనైట్ బ్రదరన్ బేతేల్ చర్చిలో ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్కతో పాటు మాజీ శాసన సభ్యులు సంపత్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్ లూక్ హాజరవుతారన్నారు.

సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యానికి ట్రాఫిక్ పోలీసుల నోటీసులు

రాంగోపాల్‌పేట్: రోడ్డు మీద వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యానికి గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. సెయింట్ ఆన్స్ స్కూల్ ఎస్పీ రోడ్ గేటు వైపు విద్యార్థులను పికప్, డ్రాప్ కోసం ఆటోలు ఇతర వాహనాలను రోడ్డుమీద నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. గతంలోనే హెచ్చరించినా స్పందించకపోవడంతో బుధవారం నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకట రాములు తెలిపారు.

నేడు మోండా మార్కెట్ బంద్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌ను ఈ నెల 20 గురువారం బంద్ చేయనున్నారు. మోండా మార్కెట్ చిల్లర వర్తకుల సంఘం అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్ దశ దిన ఖర్మ నేపథ్యంలో మోండా మార్కెట్‌ను మూసివేస్తున్నట్లు వ్యాపార వర్గాలు ప్రకటించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు మోండా మార్కెట్‌లో ఎలాంటి కార్యకలాపాలు, క్రయవిక్రయాలు ఉండవన్నారు.

ఎస్‌వీఐటీలో దశదిన కర్మ

సికింద్రాబాద్ మహబూబ్ కాలేజీ ఆవరణలోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో ఈ నెల 20 గురువారం తలసాని శంకర్ యాదవ్ దశదిన ఖర్మ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. మధ్యాహ్నం 12.30కు కార్యక్రమం ప్రారంభమవుతుందని కుటుంబీకులు, బంధువులు, ఆత్మీయులు, రాజకీయ ప్రముఖులు హాజరవుతారన్నారు.

విజయ డెయిరీ ఎదుట ధర్నా

లాలాపేట: విజయ డెయిరీ అధికారులు, లేబర్ ఆఫీసర్, కాంట్రాక్టర్‌లతో కుమ్మక్కై ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని ట్రాన్స్‌పోర్టు కార్మికులు ఆరోపిస్తూ బుధవారం లాలాపేటలోని విజయ డెయిరీలో తెలంగాణ మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడేళ్ల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని చాలీచాలని వేతనాలతో జీవనం కష్టతరంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు కొరపాక అంజి, బాల్‌రాజు, సెక్రటరీ హమీద్ ఖాన్, సాదిక్, హుస్సేన్, నయీమ్,నత్తి, కరుణ, బాలకృష్ణ, ఉమాకాంత్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వ్యర్థాలను తొలగించండి

సనత్‌నగర్: కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ పార్కు ఎదురుగా ఆదిత్యనగర్ కమ్యూనిటీ హాల్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతం డంపింగ్ కేంద్రంగా మారుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్దనే చెత్త పారబోస్తున్నారు. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న గ్రిల్స్ కూడా శిథిలావస్థకు చేరడంతో పాటు పక్కనే పిచ్చి మొక్కలు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతుందని తులసీనగర్‌కు చెందిన శంకర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి వెళ్లాలంటే భయంగా ఉందని అధికారులు స్పందించి ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు చేపట్టి నూతనంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

ప్రొ.మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ దివంగత అధ్యాపకులు ప్రొ.మోహన్ సింగ్ విద్యార్థులకు చేసిన సేవలను మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో జరిగిన ప్రొ.మోహన్‌సింగ్ ప్రథమ వర్ధంతి సభలో డాక్టర్ మోహన్‌సింగ్ వ్యక్తిత్వం, రచనలపై చర్చ జరిగింది. కార్యక్రమానికి ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, మాజీ వీసీ ప్రొ.సాయన్న, డాక్టర్ అజయ్, బ్రిజేష్, స్వప్న, బండి రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కేంద్ర మంత్రుల స్వాగత ఏర్పాట్లపై సమావేశం

సనత్‌నగర్: కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నగరానికి రానున్న సందర్భంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కరీంనగర్ పర్యటనలో ఉన్న బండి సంజయ్ గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు రానున్నారు. 4 గంటల సమయంలో కిషన్‌రెడ్డి కూడా వస్తున్నారు. బుధవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శులు దుగ్యాల ప్రదీప్ కుమార్, కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్‌లు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగత ఏర్పాట్లను పరిశీలించారు.



స్వాగత ఏర్పాట్లపై చర్చించుకుంటున్న బీజేపీ నాయకులు

ప్రజా సమస్యలపై వారంలో ఓరోజు బస్తీ పర్యటన



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: ఎన్నికలతో సంబంధం లేకుండా అభివృద్ధే ఎజెండాగా వారంలో ఒక రోజు ప్రజా సమస్యలపై బస్తీ, కాలనీల్లో పర్యటిస్తానని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి తెలిపారు. తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో బుధవారం జీహెచ్ఎంసీ వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానికుల సమస్యలపై ఆరా తీశారు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగు నీటి కలుషితం, నాలాలు, మ్యాన్‌హోళ్ల మరమ్మతుల నిర్వహణ తదితర సమస్యలను డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా విభాగాల అధికారులతో అక్కడికక్కడే చర్చించి వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 50 పడకల ప్రభుత్వ హాస్పిటల్ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఈఈ ఆశాలత, డీఈ సువర్ణ, ఆర్‌యూబీ ప్రాజెక్టు అధికారి రేణుక, ఎంటమాలజీ అధికారి దుర్గా ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ రజినీకాంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించి సురక్షితంగా ప్రయాణం సాగించాలని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్ రాజు సూచించారు. బుధవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు-నివారణ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరిపై ఉందని, అందరూ బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా, మూడు నెలల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేసమయంలో సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి జనరల్ మేనేజర్ రవికుమార్, డీజీఎం శ్రీకాంత్, ఏజీఎం దయాకర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

తలసానికి పలువురి పరామర్శ



తలసానిని పరామర్శిస్తున్న మైనంపల్లి

సనత్‌నగర్: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. ఇటీవల తన సోదరుడు, మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్‌యాదవ్ మరణించగా, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో కలిసి పరామర్శించారు. శంకర్‌యాదవ్ బోయిన్‌పల్లి వర్తకులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సనత్‌నగర్‌కు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు సుమాన్, జమీర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి పరామర్శించారు. వారి వెంట బొల్లారం కార్పొరేటర్ జితేంద్రనాథ్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ బడులు నిర్వీర్యం అవుతున్నాయని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రభుత్వ బడుల పరిశీలన కార్యక్రమంలో భాగంగా అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించి మాట్లాడారు. విచ్చలవిడిగా ఫీజుల పేరుతో పేద వర్గాల ప్రజల రక్తం తాగుతున్న ప్రైవేటు పాఠశాలల ఆగడాలను అరికట్టడానికి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫీజుల పేరుతో విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్ సువర్ణ, సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, యాదగిరి, శ్రీహరి, సయ్యద్, సాయిలు, నాగరాజ్ పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనపై అవగాహన



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి సాయిశంకర్

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నులిపురుగుల నిర్మూలనపై అవగాహన ర్యాలీని వైద్యాధికారి సాయిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నులి పురుగుల నిర్మూలన కోసం 01-20 సంవత్సరాల లోపు వారందరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని స్కూళ్లు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు అందుబాటులో ఉంటాయని మధ్యాహ్న భోజనం అనంతరం ఈ మాత్రను పిల్లలకు వేస్తామన్నారు. తల్లిదండ్రులందరూ విధిగా తమ పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను వేయించాలని సూచించారు. వివిధ కారణాలతో వేయించుకోలేని వారు ఈ నెల 27 సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జావేద్

సికింద్రాబాద్: ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 15 లక్షల విలువ చేసే 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు సాయీశ్వర్‌గౌడ్, సరస్వత్ కథనం ప్రకారం..జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా ప్లాట్‌ఫామ్‌లు, రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 2వ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అనుమానాస్పదంగా కనిపించిన రెండు ట్రాలీ బ్యాగులను పోలీసులు అనిఖీ చేశారు. అందులోంచి గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. బ్యాగులను విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి తరలించిన అస్సాం రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన దిలీప్‌కుమార్ (34) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆదే కేసులో గంజాయిని విక్రయించిన ఒడిశాకు చెందిన తపన్, ఢిల్లీలో వ్యాపారం చేసేందుకు దిగుమతి చేసుకునే ప్రయత్నం చేసిన బిజయ్‌లను నిందితులుగా చేర్చి వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలు



మొక్కలు పంపిణీ చేస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినాన్ని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీతో పాటు పిల్లలకు పుస్తకాల అందజేశారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. విద్య అన్నది ప్రాథమిక హక్కు అని, అది అందించే జ్ఞానంతో యువత శక్తివంతులుగా మారుతారని రాహుల్‌గాంధీ చెబుతుంటారని ఆయన స్ఫూర్తితోనే తాము పుస్తకాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో విశాల్ సూదం, శ్రీనివాసరావు, తోట మణిమాల, షేక్‌గౌస్, చిరంజీవి, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, సునీల్ పాల్గొన్నారు. బేగంపేటలో మైనార్టీ నేత షేక్ గౌస్ ఆధ్వర్యంలో జరిగిన రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నేతలు హాజరై భారీ కేక్‌ను కట్ చేశారు.